క్లుప్తంగా

బోనాల ఉత్సవాలను విజయవంతం చేద్దాం

కొందుర్గు: మండల కేంద్రంలో శ్రావణమాసంలో నిర్వహించే బోనాల ఉత్సవాలను విజయవంతం చేద్దామని మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ అన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులతో ఆయన సమావేశమై బోనాల ఉత్సవాలపై చర్చించారు. గ్రామంలో ఏ దేవతకు ఏ రోజు బోనాలు చేయాలని నిర్ణయించారు. ఆగస్టు 9న చింతల్ల పోచమ్మకు బోనాలు కార్యక్రమంతో ప్రారంభమై, ఆగస్టు 26న శేరీల మైసమ్మ బోనాల ఉత్సవాలతో ఈ ఏడాది బోనాల ఉత్సవాలు ముగించడానికి నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్సవాలను కలిసిమెలిసి జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, శ్రీను, కృష్ణయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు



మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ స్వామి నారాయణ గురుకుల్ ఎదురుగా మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి చెట్టు విరిగిపడి జాతీయ రహదారిపై సగం వరకు పడింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విరిగిపడిన చెట్టును సంబంధిత అధికారులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు

ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం శ్రీలత తదితరులు

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయులు కష్టపడి పనిచేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో 14 సంవత్సరాలుగా పనిచేసిన ఉపాధ్యాయులు ఆమనగల్, షాబాద్ మండలాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్ పాఠశాలకు ఉపాధ్యాయులు శేరిలింగంపల్లి నుంచి బదిలీపై వచ్చారు. దీంతో పాఠశాల హెచ్‌ఎం శ్రీలత బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను వీడ్కోలు పలుకుతూ విచ్చేసిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి సన్మానించారు.

వ్యాక్సినేషన్‌ను విజయవంతం చేయండి

షాబాద్: మెదడు వాపు నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం షాబాద్ దవఖానాలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 4,767 మంది పిల్లలకు టీకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ టీకాలు తొమ్మిది నెలల నుంచి 16 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఇస్తామన్నారు. ఆయా పాఠశాలల్లో చిన్నారులకు టీకాలు వేయనున్నట్లు, పాఠశాలకు వెళ్లని చిన్నారులకు ప్రతీ వారం వారి వారి ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆరోగ్య శిక్షణ అధికారి లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.

నివాళి

చేవెళ్ల: దివంగత కొండా వెంకటరంగారెడ్డి ఉమ్మడి రాష్ట్ర మొదటి ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ఆయన ఈ ప్రాంతం, రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని బీజేపీ నాయకులు అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో ఉన్న కొండా వెంకటరంగారెడ్డి విగ్రహం వద్ద బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఇంద్రాసేనారెడ్డి, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

షాబాద్: మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు బుధవారం ఏఈ నరేందర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, రోజు రోజుకు లెక్కలేకుండా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే!

- విద్యార్థులు, వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



బురదలో నడుచుకుంటూ హైతాబాద్ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

షాబాద్: చినుకు పడితే ఆ రోడ్డు చిత్తడిగా మారి విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందిగా తయారైంది. గ్రామాల రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అధికారులు చెబుతున్న మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయే తప్పా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. దీంతో వాహనదారులు, విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. చినుకు పడితే చిత్తడిగా మారే ఆ రోడ్డు నుంచి వెళ్లాలంటే నరకయాతన పడుతున్నామని పేర్కొంటున్నారు. ఇది మండల పరిధిలోని హైతాబాద్ నుంచి కేతిరెడ్డిపల్లికి వెళ్లే రోడ్డు పరిస్థితి. గత నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆ రోడ్డు చిత్తడిగా మారింది. దీంతో బుధవారం హైతాబాద్ పాఠశాలకు కాలినడకన వెళ్లే విద్యార్థులు, ప్రజలు ఆ రోడ్డు నుంచి వెళ్లాలంటే నరకయాతన పడ్డారు. ఈ రహదారి దుస్థితిని పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పటించుకొని తమ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ రోడ్డుపై నుంచి ప్రతి రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డు బాగు చేయాలని విద్యార్థులు, వాహనదారులు కోరుతున్నారు.

హామీలు అమలు చేయాలి

ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులుగౌడ్, మండల అధ్యక్షుడు కుమార్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కృష్ణయ్యకు బుధవారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారం వచ్చే వరకు బీసీల గురించి మాట్లాడిన నాయకులు ఇప్పుడు బీసీలను మోసం చేస్తోందన్నారు. బీసీలకు రాష్ట్రంలో సముచిత న్యాయం కల్పించాలన్నారు. లేదంటే బీసీలంతా ఏకమై ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణగౌడ్, శర్వలింగం, శ్రీనివాస్, సత్యనారాయణ, వైభవ్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, మధూకర్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలి

ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్

షాద్‌నగర్: ప్రమాదాల నివారణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రమాదరహిత వారోత్సవాల్లో భాగంగా బుధవారం షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో మేనేజర్ ఉష అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ.. బస్సులు నడిపే సమయంలో డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడొద్దని, మద్యం సేవించి బస్సులు నడపొద్దని సూచించారు. బస్సు నడిపే సమయంలో డ్రైవర్లు మానసికంగా ప్రశాంతతో సన్నద్ధం కావాలన్నారు. ప్రయాణికుల భద్రత డ్రైవర్ల చేతిలో ఆధారపడి ఉంటుందన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బస్సు డ్రైవర్లు, కండక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డీఐ అర్జున్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఎం అలీ, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఐకమత్యంగా పనిచేసినప్పుడే ఆర్థికాభివృద్ధి

మొయినాబాద్‌రూరల్: ఐకమత్యంగా అందరు కలిసి పనిచేసినప్పుడే ఆర్థికంగా అభివృద్ధి చెందుతామని ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన కమిటీని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం ముర్తుజాగూడ సమీపంలోని ఓ ఫామ్‌హౌజ్‌లో నిర్వహించగా ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడిగా మాణిక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా నర్సింహా, కుటుంబ భరోసా ఇన్‌చార్జిగా నరేశ్, సలహాదారులుగా రఘు, యాదగిరి, శశిధర్, వడ్ల రమేశ్‌చారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కోళ్ల శివ, సిద్ధు, రామకృష్ణారెడ్డి, సందీప్, ప్రదీప్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారిని పూలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విష్ణుగౌడ్, మధుసాగర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



మొక్కలు నాటుతున్న భీంభరత్

షాబాద్: పచ్చని చెట్లే ప్రకృతిని సమతుల్యంగా ఉంచుతూ ప్రాణకోటికి జీవనాధారంగా ఉంటాయని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలకు కేటాయించిన లక్ష్యం మేరకు ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటుతూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

'బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం'

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేశారని కాంగ్రెస్ నేతలు బాబర్‌ఖాన్, రఘులు విమర్శించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రఘునాయక్‌లు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం బీహార్, ఏపీకే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తెలంగాణకు నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు నియంతృత్వ వైఖరి అవలంభిస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు 8 మంది ఉన్నా బడ్జెట్‌లో నిధుల సాధించడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. బీజేపీ ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బడ్జెట్‌లో నిధులు సాధించుకునేందుకు బీఆర్‌ఎస్ నేతలు తమతో కలిసి ముందుకురావాలన్నారు. బడ్జెట్‌పై కేంద్రాన్ని నిలదీయకుండా బీఆర్‌ఎస్ నేతలు తప్పించుకుంటున్నారన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, సత్తయ్య, మానపాటి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్రం'

చేవెళ్ల: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల సంక్షేమాన్ని విస్మరించిందని, ఇది బడా కార్పొరేట్ బడ్జెట్‌లా ఉందని సీపీఎం చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి అల్లి దేవేందర్ అన్నారు. చేవెళ్లలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు ఏమాత్రం న్యాయం చేసేలా లేదన్నారు. ఈ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రం ఊసే ఎత్తకుండా ప్రజలను బీజేపీ మోసం చేసిందన్నారు. బీజేపీని నమ్మి 8 మంది ఎంపీలను గెలిపిస్తే మోసం చేసిందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గించిందన్నారు. కేవలం రాజకీయ మిత్రుల కోసం మాత్రమే ఆ రాష్ట్రాలు అయినా బీహార్, ఆంధ్రప్రదేశ్‌లకు ఎక్కువ నిధులు కేటాయించిందని ప్రజలు అర్థం చేసుకుంటారన్నారు. తెలంగాణ ఎంపీలు ప్రధాని మోదీ ఎదుట నిరసన తెలపాలన్నారు. లేదంటే ప్రజలు రాబోయే ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు.

అప్రమత్తత తప్పనిసరి

షాబాద్: వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షాబాద్ ఎంపీడీఓ అపర్ణ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు పడే సమయంలో ప్రజలు శిథిల ఇళ్లల్లో ఉండొద్దని తెలిపారు. ఇనుప విద్యుత్ స్తంభాలు, తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దన్నారు. ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగి కిందపడితే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, విద్యుత్ శాఖ ఏఈ నరేందర్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



షాద్‌నగర్: కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



చేవెళ్లలో కేక్ కట్‌చేస్తున్న నాయకులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం బీఆర్‌ఎస్ మండల నాయకులు ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్‌చేసి, ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు దేశమొళ్ల అంజనేయులు, కనీస వేతన బోర్డు మాజీ చైర్మన్ నారాయణ, మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తూరు: పట్టణంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఆధ్వర్యంలో బుధవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పలువురు నాయకులతో కలిసి పట్టణంలోని కేజీబీవీ హాస్టల్‌లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం హాస్టల్ ఆవరణలో మొక్కలను నాటారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: మండల కేంద్రంలో బుధవారం కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. తెలంగాణ ఉద్యమంతో పాటు, పదేళ్ల పాటు ప్రభుత్వంలో ఉండి కేటీఆర్ అనేక సేవలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు జయవంత్, కార్యదర్శి నర్సింహాగౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవూఫ్, మాజీ సర్పంచ్‌లు కుమార్, మహేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోండి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



మురుగునీటి కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ అశోక్

శంకర్‌పల్లి: వర్షాకాలం దృష్ట్యా శిథిల ఇళ్లల్లో నివాసం ఉండే ప్రజలు తాత్కాలికంగా ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రామంతాపూర్‌లో కౌన్సిలర్ అశోక్‌తో కలిసి పర్యటించారు. వార్డులోని అంతర్గత మురుగునీటి కాల్వలు, పిచ్చిమొక్కలు, గడ్డిని కార్మికుల చేత తొలగింపజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ... శిథిల ఇళ్లలోని ప్రజలకు వార్డు కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లలో పునఃరావసం ఏర్పాటు చేసి, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలోమున్సిపల్ పర్యావరణాధికారి ఆనంద్, జవాన్లు శాంతికుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

పట్టణ సీఐ విజయ్‌కుమార్



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సీఐ విజయ్‌కుమార్, భక్తులు

షాద్‌నగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పట్టణ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని పట్టణంలోని గంజ్ ఆవరణలో ఉన్న వినాయక దేవాలయంలో బుధవారం బీఆర్‌ఎస్ నేత మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, నాయకులు వెంకటేశ్‌గౌడ్, మహావీర్, డాక్టర్ రవి, అభిలాశ్, ప్రదీప్, శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీధర్, రవి, కత్తి శేఖర్, గడవాడ నర్సింలు, శ్రీకాంత్, శంకర్‌లాల్, ఓం ప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కొత్తూరు: కాంగ్రెస్ అంటేనే అభివృద్ధికి చిరునామా అని పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని జాతీయ రహదారి వైజంక్షన్ కూడలి నుంచి రైల్వే వంతెన వరకు ఉన్న పాత జాతీయ రహదారి విస్తరణ పనులను వారు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పదేళ్ల నుంచి విన్నవించిన ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే శంకర్ సహకారంతో నెలల్లోనే రోడ్డు విస్తరణ చేపట్టడంతో పాటు మిషన్ భగీరథ నీటి సరఫరాను ప్రారంభించామన్నారు. కాగా ఈ సమస్యలపై మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు తమ హయాంలో నిధులు మంజూరుచేస్తే కాంగ్రెస్ నాయకులు పనులు చేస్తున్నారని ఆరోపించడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నిజాలు తెలుసుకొని మాట్లాడి వారి గౌరవాన్ని నిలుపుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, కర్రోళ్ల సురేందర్, శ్రీను, నర్సింహా, జనార్థన్‌చారి, గోవింద్‌నాయక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడుదాం

షాద్‌నగర్‌రూరల్: హక్కుల సాధనకు అందరం ఐక్యంగా ముందుకు సాగుదామని మెయిన్ స్ట్రీమ్ మీడియా కమిటీ షాద్‌నగర్ అధ్యక్షుడు సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం షాద్‌నగర్ పరిధిలోని ఈదులపల్లి గ్రామ శివారులో ఉన్న కోకో ఫామ్ రీసార్టులో షాద్‌నగర్ మెయిన్ స్ట్రీమ్ మీడియా జర్నలిస్టుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. పాత్రికేయులు జర్నలిజం విలువలను కాపాడాలన్నారు. సమస్యలు, హక్కుల సాధనకు అందరూ ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఖాజాపాషా, అధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా భాస్కర్, నరేశ్, శివ, కార్యదర్శిగా దనారం రమేశ్, కార్యదర్శులుగా అర్షద్, మొయిస్, కిరణ్, ఫణీంద్ర, ప్రచార కార్యదర్శులుగా రమేశ్, నరేందర్, సురేశ్, కోశాధికారిగా రాజశేఖర్‌గౌడ్, సభ్యులు నర్సింహారెడ్డి, రాంచంద్రయ్య, ధర్మపాల్, అరుణ్‌కుమార్, బాలు, శంకర్, సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా లక్కాకుల రమేశ్, మన్సూర్ అలీ, రాఘవేందర్, ఫెరోజ్, మసలియోద్దీన్, గౌరవ సలహాదారులుగా కస్తూరి రంగనాథ్, సంజయ్‌కుమార్, శరత్‌కుమార్, బొబ్బిలి ప్రవీణ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



తిమ్మారెడ్డిపల్లిలో బోనాల ఊరేగింపు

షాబాద్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో బుధవారం మైసమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు బోనాల ఊరేగింపుతో ఆలయానికి తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, మాజీ సర్పంచ్ శకుంతల, మాజీ ఎంపీటీసీ సునీత, పాండు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఎలికట్ట గ్రామంలో..

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో బుధవారం పోచమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల, శివసత్తుల ఆటలు, పోతురాజుల నృత్యాలు, యువకుల డ్యాన్సులతో బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.